సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 16 । మార్చి । 2023



కంటివెలుగు ప్రారంభం

వేములవాడఅర్బన్: నాంపల్లి పాఠశాలలో బుధవారం కంటివెలుగు ప్రారంభించారు. ఐదు, ఆరు వార్డుల కౌన్సిలర్లు జడల లక్ష్మి, నీలం కల్యాణి, శ్రీనివాస్, శేఖర్ ఉన్నారు.



రాజన్న ఆదాయం రూ.2.06 కోట్లు

వేములవాడ: రాజన్న హుండీని బుధవారం లెక్కించగా రూ.2,06,37,320 నగదు, 296.640 గ్రాముల బంగారం, 19.600 కిలోల వెండి వచ్చినట్లు ఈవో తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోత గా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలు లు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

చెత్తే కదా అని..

బయట పడేస్తే తాటా తీస్తున్న బల్దియా



● మీరు చూస్తున్న చిత్రం స్వచ్ఛ సిరిసిల్లలో ఓ ఆర్ఎంపీ వైద్యుడు బాధ్యతలు మరిచి బయోవేస్టేజ్‌ను కార్గిల్‌లేక్ వద్ద రోడ్డు వెంట పడేశాడు. మున్సిపల్ అధికారులు గుర్తించి ఆర్ఎంపీ వైద్యుడిని అక్కడికి పిలిపించి హెచ్చరించారు. రూ.15వేలు జరిమానా విధించారు.



మీరు చూస్తున్న ఈ చెత్త దృశ్యం సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్ ప్రాంతానికి చెందిన మెహెర్‌కృప కిరాణం యజమాని పదిహేను రోజుల క్రితం మార్కెట్ ప్రాంతంలో పడేశాడు. స్థానికుల నుంచి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు అందగా.. చెత్తలో షాపునకు సంబంధించిన బిల్లులను మున్సిపల్ సిబ్బంది గుర్తించి దుకాణాన్ని సీజ్ వేశారు.



● ఈ చిత్రం.. సిరిసిల్ల–తంగళ్లపల్లి రోడ్డు పక్కన విద్యానగర్ ప్రాంతంలో కొందరు కూరగాయలు, ఇతర చెత్తను నిత్యం పడేస్తున్నారు. బుధవారం ఉదయం బైపాస్ జంక్షన్ ప్రాంతాన్ని కమిషనర్ సమ్మయ్య సందర్శించారు. ఈ సమయంలోనే చెత్త పడేస్తున్న వారిని గమనించి సిబ్బంది సాయంతో పట్టుకుని రూ.2వేలు జరిమానా విధించారు. బహిరంగ స్థలాల్లో చెత్త పడేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- చెత్త పడేసే వారిని వెతికి జరిమానాలు
- అపరిశుభ్రతపై సిరిసిల్ల మున్సిపల్ పోరు
- ప్లాస్టిక్ నిషేధంలోనూ కఠిన చర్యలు

సిరిసిల్లటౌన్: స్వచ్ఛ సిరిసిల్ల కీర్తి కాపాడేందుకు మున్సిపల్ అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. చెత్తను రోడ్లపై పడేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధిస్తున్నారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛ పరిసరాలను అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా బల్దియా అధికారులు ముందుకెళ్తున్నారు. ఇటీవల రెండు సంఘటనల్లోనూ చెత్త పడేసిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవడమే ఇందుకు నిదర్శనం.

చెత్త రహితం..ప్లాస్టిక్ నిషేధం

ప్రథమ శ్రేణి మున్సిపల్‌గా ఆవిర్భవించిన సిరిసిల్లలో 39 వార్డుల్లో 1,09,850 జనాభా ఉంది. నిత్యం పట్టణంలో 50 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. పారిశుధ్య పనుల్లో ఇంటింటా చెత్త పేరుతో 48 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. గత జూలై నుంచి సిరిసిల్ల బల్దియా 16 రకాల ప్లాస్టిక్ వస్తువులను నిషేధించింది. ఇయర్‌బర్డ్స్, బెలూన్స్, క్యాండి, ఐస్‌క్రీమ్ కోసం వాడే పుల్లలు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ప్లాస్టిక్ కత్తులు, ట్రేలు, ప్లాస్టిక్ స్వీట్‌బాక్సులు, ఆహ్వాన పత్రికలు, సిగరెట్ ప్యాకెట్లు, 100 మైక్రాన్ల లోపు ఉండే పీవీసీ బ్యానర్లు, పాలిస్టరిన్(థర్మాకోల్) 120 మైక్రాన్ల కన్నా తక్కువ ఉండే ప్లాస్టిక్ కవర్లను అమ్మకుండా చూస్తున్నారు. పట్టణంలో ప్రతీ రోజు 12 టన్నుల వరకు ప్లాస్టిక్ చెత్తను బల్దియా సేకరిస్తుంది. పండుగ రోజుల్లో ఇది 20 టన్నుల వరకు చేరుతుంది.

స్వచ్ఛతపై పెరిగిన బాధ్యత

సిరిసిల్ల మున్సిపాలిటీ ఏడేళ్లుగా ప్లాస్టిక్ నిషేధం.. చెత్త రహిత పట్టణం.. పారిశుధ్య నిర్వహణతో స్వచ్ఛసర్వేక్షన్ పోటీల్లో ఆరేళ్లుగా అవార్డులు సాధిస్తుంది. ప్లాస్టిక్ వస్తువుల నిషేధం అమలును పర్యవేక్షించేందుకు వారంలో రెండు సార్లు బల్దియా అధికారులు ఆకస్మిక దాడులు చేస్తున్నారు. గత ఆరు నెలలుగా చెత్త పడేసే వారు, ప్లాస్టిక్ నిషేధంపై వందకుపైగా కేసులు నమోదు చేశారంటే మున్సిపల్ అధికారులు ఎంత పకడ్బందీగా ముందుకెళ్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

కఠినంగా వ్యవహరిస్తాం




చెత్త, ప్లాస్టిక్ రహిత సిరిసిల్ల కీర్తికి మచ్చలు తెచ్చేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. రానున్న రోజుల్లో చట్టపర చర్యలకు వెళ్తాం. రోడ్లపై చెత్త, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను పడేయరాదు. స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో ఉత్తమ ర్యాంకు సాధించడానికి ట్రిపుల్ ఆర్ నినాదంతో ముందుకుపోతున్నాం. స్వచ్ఛ సిరిసిల్లకు ప్రజలు సహకరించాలి.

– వెల్దండి సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్

సిరిసిల్ల మున్సిపల్ ప్రొఫైల్..

పట్టణ జనాభా	1,09,850
వార్డులు	39
శానిటేషన్ సిబ్బంది	277
నిత్యం చెత్త ఉత్పత్తి	50 మెట్రిక్ టన్నులు
సేకరిస్తున్న చెత్త	48 మెట్రిక్ టన్నులు
నిత్యం ప్లాస్టిక్ పదార్థాల ఉత్పత్తి	12టన్నులు



రూ.15వేలు జరిమానా విధించిన రశీదు

రాణా మెట్లెక్కిన పండుటాకులు

● కొడుకు, కోడలుపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మలిసంధ్యలో ఆదరణ లేక పండుటాకులు పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కారు. కొడుకు, కోడలు ఇబ్బందులు పెడుతున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన సల్లూరు బాలలక్ష్మి–పర్శురామ్‌గౌడ్‌లకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. కుమారుడు రవీందర్, కోడలు అంజవ్వ తమకు తిండి పెట్టడం లేదంటూ బుధవారం బాలలక్ష్మి–పర్శరాముగౌడ్‌లు పోలీసులను ఆశ్రయించారు. అన్నం పెట్టాలని వేడుకుంటే చేయి చేసుకుంటున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టిన ఎస్సై శేఖర్ వృద్ధ దంపతులపై అనుచితంగా ప్రవర్తిస్తున్న కుమారుడు, కోడలుపై కేసు నమోదు చేశారు. తల్లిదండ్రులను మంచిగా చూసుకొని, భోజనం పెట్టాలని కౌన్సెలింగ్ ఇచ్చారు.

ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయండి

● డీపీఆర్‌వో దశరథం



కళాకారులతో మాట్లాడుతున్న డీపీఆర్‌వో దశరథం

సిరిసిల్లకల్చరల్: ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని జిల్లా పౌరసంబంధాల అధికారి మామిండ్ల దశరథం సూచించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో బుధవారం సాంస్కృతిక సారథి కళాకారులతో సమావేశమయ్యారు. పల్లెప్రగతి, పట్టణప్రగతి, దళితబంధు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, మిషన్ భగీరథ, మన ఊరు–మన బడి, సాగునీటి ప్రాజెక్టులు, హరితహారం, కేసీఆర్ కిట్లు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, ఆసరా, కంటివెలుగు వంటి పథకాలపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంచాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో ప్రచారం చేస్తూనే ఆయా ఫొటోలను హైదరాబాద్‌లోని సాంస్కృతిక సారథి రాష్ట్ర కార్యాలయంతోపాటు జిల్లా పౌర సంబంధాల కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

న్యూస్‌రీల్

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి



అధికారులకు సూచనలిస్తున్న డీపీవో రవీందర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ అధికారులకు సూచించారు. తంగళ్లపల్లి మండల పరిషత్‌లో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ పథకం సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా డీపీవో రవీందర్ మాట్లాడుతూ మార్చి నెలాఖరు నాటికి మండలంలోని అన్ని గ్రామాల్లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులు పెండింగ్ ఉండకుండా, పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పి.లచ్చాలు, ఏపీవో రాపోల నాగరాజు, ఇన్‌చార్జి ఎంపీవో శ్రీధర్‌రెడ్డి, టీఏలు లక్ష్మణ్, మనోహర్, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు



మాట్లాడుతున్న గుంటి వేణు

ఇల్లంతకుంట(మానకొండూర్): వామపక్ష ప్రజాతంత్ర లౌకికవాద శక్తులను ఏకం చేసేందుకు నెల రోజులపాటు బీజేపీకి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పేర్కొన్నారు. ఇల్లంతకుంట మండలంలోని తాళ్లపల్లిలో బుధవారం సమావేశమయ్యారు. వేణు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వేలాది మంది దళితులపై దా డులు జరిగాయన్నారు. ఈ సమావేశంలో మల్లేశం, లక్ష్మణ్, ఎల్లయ్య, రాజేందర్, బాలయ్య, పర్శరాములు తదితరులు ఉన్నారు.

రాజన్న సేవలో ఎస్‌బీఐ చీఫ్ జీఎం



చీఫ్ జనరల్ మేనేజర్ అమిత్ జింగ్రాన్‌ను సన్మానిస్తున్న ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చీఫ్ జనరల్ మేనేజర్ అమిత్ జింగ్రాన్ బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. ఈవో కృష్ణప్రసాద్ రాజన్న ప్రసాదం అందించారు.

బాలసాహిత్యాన్ని ప్రోత్సహించడం అభినందనీయం



విద్యార్థుల సంకలనాలు ఆవిష్కరిస్తున్న దేవేంద్ర, వైద్యులు

ముస్తాబాద్(సిరిసిల్ల): బాలసాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్న వైద్య సోదరులు చింతోజు రాజారాం, చింతోజు శంకర్, చింతోజు నారాయణ సేవలు అభినందనీయమని కోఠి ఉమెన్స్ కాలేజీ ప్రొఫెసర్, రచయిత్రి డాక్టర్ దేవేంద్ర పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో డాక్టర్ చింతోజు బ్రహ్మయ్య, బాలమణి సాహితీ పురస్కారాలకు వచ్చిన 90 మంది బాలల కథల సంకలనాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత్రి దేవేంద్ర మాట్లాడుతూ.. గత పదేళ్లగా బాలసాహిత్యాన్ని, విద్యార్థుల రచనలను ప్రోత్సహిస్తున్న చింతోజు వైద్యసోదరులను అభినందించారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రెండు తెలుగు రాష్ట్రాలలోని బాలకవులను ఆహ్వానిస్తూ ఉత్తమ సంకలనాలకు అవార్డులు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. 30 ఉత్తమ రచనలను ప్రొఫెసర్ దేవేంద్ర ఆవిష్కరించారు. వీరికి త్వరలోనే అవార్డులు అందజేస్తామని కమిటీ కన్వీనర్ గరిపెల్లి అశోక్ తెలిపారు. ఈసందర్భంగా రచయిత్రి దేవేంద్రను సన్మానించారు. వైద్యులు రాజారాం, శంకర్, నారాయణ, తేజ, అఖిల, అర్చన తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలోని కాలేజీ ఎదుట గుమిగూడిన విద్యార్థులు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

సిరిసిల్లఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఫస్టియర్ సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 4,153 మంది విద్యార్థులకు 3,963 మంది హాజరైనట్లు ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారులు తెలిపారు. సిరిసిల్లలోని సెస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు, పరీక్ష కేంద్రంలో వసతులు, విద్యార్థుల హాజరును పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, కాలేజీ ప్రిన్సిపాల్ జి.వనజకుమారిని అడిగి తెలుసుకున్నారు.



సిరిసిల్లలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థినులు

'డబుల్' ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

● అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



హరిదాస్‌నగర్‌లో పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులను బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్‌ను పూర్తి స్థాయిలో అందేలా చూడాలన్నారు. లబ్ధిదారుల ఎంపికపై గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. గ్రామసభలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు అర్హులనే ఎంపిక చేయాలని సూచించారు. అర్హులకు త్వరగా ఇళ్లు అందించేందుకు వీలుగా పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. తహసీల్దార్ జయంత్‌కుమార్, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, పీఆర్ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పనులు పూర్తి చేయండి

● కలెక్టర్ అనురాగ్ జయంతి

కోనరావుపేట(వేములవాడ): ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన 'మన ఊరు – మన బడి' పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. మండలంలోని ధర్మారం, సుద్దాల గ్రామాల్లోని మండల పరిషత్, ఉన్నత పాఠశాలల్లోని పనుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోగా విద్యుత్, తాగునీరు, ఇతర మరమ్మతు పనులను పూర్తి చేయాలని సూచించారు. ఉపాధిహామీలో చేస్తున్న మరుగుదొడ్లు, వంటగదులు, ప్రహరీ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధర్మారం పాఠశాలలో బాలుర టాయిలెట్లను మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తేవాలన్నారు. సుద్దాలలో మిషన్ భగీరథ తాగునీరు పాఠశాలతోపాటు ఇళ్లకు కూడా రావడం లేదని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

కంటివెలుగు అందరికీ అందించాలి

ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న కంటివెలుగును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు.



కంటివెలుగు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

గ్రామంలో ఇప్పటి వరకు 724 మందికి పరీక్షలు చేశామని, 9 రోజులపాటు గ్రామంలో శిబిరం నిర్వహిస్తామన్నారు. కోనరావుపేట మండలానికి 56 కమ్యూనిటీ ఇంకుడు గుంతలు మంజూరుకాగా 27 మాత్రమే పూర్తయ్యాయని, మిగతా వాటిని త్వరగా పూర్తిచేయాలన్నారు. ఎంపీపీ చంద్రయ్యగౌడ్, డీఈవో రమేశ్, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, ఉపవైద్యాధికారి శ్రీరాములు, వైద్యాధికారి వేణుగోపాల్, సర్పంచులు అనుపాటి భారతి, గున్నాల అరుణ, దేవలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్లు ఎరవెల్లి విజయ్ తదితరులు ఉన్నారు.

సదెరం క్యాంపు

సిరిసిల్లటౌన్: జిల్లా ఆస్పత్రిలో బుధవారం దివ్యాంగుల నిర్ధారణ పరీక్షలకు అధికారులు సదెరం క్యాంపు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 13 మండలాల నుంచి వచ్చిన బాధితులకు కంటిచూపు, వినికిడి పరీక్షలు నిర్వహించారు. కంటిచూపు 23, వినికిడి సమస్యతో 20 మంది వచ్చినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీధర్‌రావు తెలిపారు. వైద్యులు రజనీ, రఘు, మోహన్‌కృష్ణ, ఏపీవో పాపారావు పాల్గొన్నారు.



కంటిపరీక్షలు చేస్తున్న డాక్టర్ రజనీ

పట్టుకోండి చూద్దాం పార్ట్ 5

'కట్టా'ను పట్టుకున్నాం!

- 34 ఏళ్లుగా పంచాయతీరాజ్‌లో కట్టా విష్ణువర్ధన్ కొలువు
- 'సాక్షి' పరిశోధన కథనాలతో వెలుగుచూసిన వాస్తవం
- ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టిన అధికారులు
- అతని తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ టీచర్లేనన్న దర్యాప్తు
- 1956లో తల్లి నిరూప, 1967లో విష్ణువర్ధన్ జన్మించినట్లు రికార్డులు
- ఉన్నత విద్య కోసం లీవులే పెట్టలేదని తేల్చిన అధికారులు
- క్రిమినల్ ఇన్‌టెన్షన్‌తో వ్యవస్థలను తప్పుదోవ పట్టించాడని నివేదిక

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 34 ఏళ్లపాటు వ్యవస్థల కళ్లకు గంతలు కట్టాడు. ఎలాంటి అర్హత లేకున్నా.. కారుణ్య నియామకం కింద ఉద్యోగం పట్టాడు. ఉద్యోగం చేస్తూనే ఒక్కరోజు కూడా లీవు పెట్టకుండా ఇంజినీరింగ్ సర్టిఫికెట్లు కొట్టాడు. తన తల్లి తన కంటే కేవలం 10 ఏళ్లు మాత్రమే పెద్దదంటూ రికార్డులు ఇచ్చి అధికారులను ఒప్పించాడు. దొడ్డిదారిలో ప్రభుత్వ ఉద్యోగం సాధించి, సుప్రీం కోర్టు నిబంధనలకు వ్యతిరేకంగా పదోన్నతులు పొంది ఇంతకాలం సమాజాన్ని మోసం చేస్తూ వస్తోన్న పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ కట్టా విష్ణువర్ధన్ ఆట ముగిసింది.



కట్టా విష్ణువర్ధన్

'పట్టుకోండి చూద్దాం' పేరుతో 'సాక్షి' కొంతకాలంగా ప్రచురిస్తున్న కథనాలు నిజమేనని అతని వ్యవహారంపై విచారణ జరిపిన అధికారులు నిగ్గు తేల్చారు. ఇటీవలే దర్యాప్తు నివేదికను హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ ఈఎన్‌సీ కార్యాలయానికి పంపారు. ఈ నివేదిక ప్రతిని 'సాక్షి' సంపాదించింది. ఇంతకీ ఆ నివేదికలో ఏముందంటే..?

రికార్డులే లేవు.. అన్నీ అక్రమాలే..!

పంచాయతీ రాజ్ విభాగం వద్ద ఉన్న సమాచారం ప్రకారం.. కరీంనగర్ సబ్–డివిజన్, ఏఈ, కట్టా విష్ణువర్ధన్ మార్చి2, 1967లో కట్టా వెంకట నాగరత్నాచారి, కట్టా నిరూపలకు కళ్యాణగడ్డలో జన్మించారు. వీరిద్దరూ ప్రభుత్వ టీచర్లే. 1987లో వెంకట నాగరత్నాచారి మరణించారు. తన తల్లి ప్రభుత్వ టీచరు అన్న విషయాన్ని దాచి 1988లో కారుణ్య నియామకం కింద పంచాయతీరాజ్‌లో అప్పటి ఉమ్మడి జిల్లాలోని మహదేవాపూర్‌లో విష్ణువర్ధన్ గ్రేడ్–3 వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా చేరారు. వాస్తవానికి 1984లోనే కట్టా నిరూప ప్రభుత్వ టీచర్‌గా నియమితులయ్యారు. కరీంనగర్ డీఈవో కార్యాలయంలో ఆమె పుట్టిన తేదీ ఫిబ్రవరి 01, 1956గా ఉంది. విచిత్రంగా విష్ణువర్ధన్ తన పదో తరగతి సర్టిఫికెట్లలో మార్చి 02, 1967లో జన్మించినట్లు పేర్కొన్నారు. అంటే ఇద్దరి మధ్య కేవలం పదేళ్లే వ్యత్యాసమా? వాస్తవానికి విష్ణువర్ధన్ నియామకం సమయంలో అధికారులు ఈ చిన్న పాయింట్‌ను పసిగట్టలేకపోయారు. తీరా ఇటీవల అధికారులు విచారణ ప్రారంభించినప్పుడు అతని సర్వీసు బుక్ లభ్యమైందే తప్ప.. అతని నియామక రికార్డులు మాయం కావడం గమనార్హం.

పేరు, విద్యార్హతలపై అనేక సందేహాలు..!

విష్ణువర్ధన్ 1988లో సమర్పించిన సర్టిఫికెట్ల ప్రకారం .. 1967లో జన్మించానని చెప్పుకున్నారు. అవేగాక పదోన్నతుల సమయంలో మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా (ముంబై), బీటెక్ సివిల్ (రాజస్థాన్ డీమ్డ్ వర్సిటీ) సర్టిఫికెట్లు చూపారు. ఈ సర్టిఫికెట్ల విశ్వసనీయతపైనా దర్యాప్తు అధికారులు సందేహాలు వ్యక్తం చేశారు. వీటి ఆధారంగా విష్ణువర్ధన్ నాలుగు సార్లు పదోన్నతులు పొందారు. కానీ.. ఈ కోర్సులు చేస్తున్న సమయంలో ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం లేదు. ఆ కోర్సుల పరీక్షలకు హాజరయ్యే సమయంలో ఎలాంటి లీవులు పెట్టినట్లుగా రికార్డులే లేవని, అసలు ఆ సర్టిఫికెట్లు రెగ్యులరా? లేక దూరవిద్యవా? అన్న విషయం విష్ణువర్ధన్ స్పష్టత ఇవ్వలేదని నివేదికలో పొందుపరిచారు. పదోన్నతుల సమయంలో అతని ఉన్నతాధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించలేదని, అతని సర్టిఫికెట్ల విశ్వసనీయతను సైతం పరిగణనలోకి ఎందుకు తీసుకోలేదని తోటి ఉద్యోగులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో విష్ణువర్ధన్‌ను ఇంటి వద్ద అంతా 'వాసు' అని పిలుస్తారని గుర్తు చేస్తున్నారు. ఇన్ని అక్రమాలకు పాల్పడిన అతన్ని సర్వీసు నుంచి తొలగించాలని అతని తోటి ఉద్యోగులంతా వరుసగా హైదరాబాద్ ఈఎన్‌సీ కార్యాలయానికి ఫిర్యాదులు చేస్తున్నారు.

విష్ణువర్ధన్‌ది క్రిమినల్ ఇన్‌టెన్షన్..!

వాస్తవానికి నిబంధనల ప్రకారం.. కారుణ్య నియామకం కింద టైపిస్ట్, స్టెనో, క్లర్క్ ఇలాంటి దిగువ కేటగిరీ ఉద్యోగాలు ఇవ్వాలి. కానీ.. ఇతని విషయంలో మాత్రం వర్క్ ఇన్‌స్పెక్టర్ గ్రేడ్–3 ఇవ్వడం తమకు ఆశ్చర్యానికి గురిచేసిందని నివేదికలో దర్యాప్తు అధికారులు స్పష్టంచేశారు. అతను అనర్హుడని, అక్రమార్కుడని యథేచ్ఛగా అన్ని వ్యవస్థలను మోసం చేశాడని, ఉన్నతాధికారుల కళ్లకు గంతలు కట్టాడని వివరించారు.

- అతను విధుల్లో చేరినప్పటి నుంచి ఈ రోజు వరకు విధి నిర్వహణ మొత్తం అనుమానాస్పదంగా, క్రిమినల్ ఇన్‌టెన్షన్‌తోనే ఉందన్నారు. ఇందుకు బాధ్యులైన ప్రతీ అధికారిపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశారు.
- ఇతని అక్రమాలపై పూర్తిస్థాయిలో ఆరా తీసి, రికవరీకి కూడా సిఫారసు చేశారు. అదే సమయంలో అతని విద్యార్హతలపై గందరగోళం ఉందని వాటిపైనా లోతైన దర్యాప్తు చేయాలని చెప్పారు.

రిమూవల్ ఆఫ్ సర్వీస్ చేయాలి..



విష్ణువర్ధన్ పేరు నుంచి విద్యార్హతల వరకు అన్నీ నకిలీనే. 34 ఏళ్లుగా ప్రభుత్వ రంగ సంస్థలను మోసం చేస్తూ వస్తున్నాడు. అతని విద్యార్హతలపై చాలా కాలంగా పోరాటం చేస్తున్నాం. అత్యంత అవినీతి పరుడు, తోటి ఉద్యోగులను వేధించడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. పేరెంట్స్ సర్కారు ఉద్యోగులని తెలినా కారుణ్య నియామకం కింద అతన్ని కొనసాగించడం దారుణం. వెంటనే అతన్ని రిమూవల్ ఆఫ్ సర్వీస్ చేయాలి.

– ఆమిర్, సామాజిక ఉద్యమకారుడు

క్లుప్తంగా

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న అధికారి

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల పట్టణంలోని ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులకు బుధవారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. డిపో మేనేజర్ మనోహర్ ఆధ్వర్యంలో వేసవి దృష్ట్యా ఉద్యోగులకు మజ్జిగను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు సారయ్య, పి.ఎల్ ఎస్ రావు, రాంరెడ్డి, విద్యార్థి సంఘం నాయకులు రవిగౌడ్, సిబ్బంది తదితరులున్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల అర్బన్: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతని బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అంకని భాను, జిల్లా అధ్యక్షుడు స్వామిగౌడ్, ఇన్‌చార్జి మ్యాకల మునీందర్, నాయకులు చంద్రునాయక్, చాకలి రమేశ్, దేవేంద్ర, గజ్జెల అశోక్, రాజబాబు, లింగంపల్లి మధుకర్, బొడ్డు మహేందర్, అన్ని మండలాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి



లింగయ్య (ఫైల్)

బోయినపల్లి (చొప్పదండి): పొలం పనులకు వెళ్లి తిరిగివస్తుండగా బైక్ ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై పుల్లా అభిలాష్ తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన కల్లెపెల్లి లింగయ్య (75) పొలం వద్దకు వెళ్లి రోడ్డుపై నడచుకుంటూ తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో వేములవాడ రూరల్ మండలం.. తుర్కాశీ నగర్‌కు చెందిన షేక్ బాబా ద్విచక్రవాహనంపై బూర్గుపల్లి వైపు వేగంగా వచ్చి లింగయ్యను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో లింగయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. తన తండ్రి మృతికి కారణమైన షేక్ బాబాపై చర్యలు తీసుకోవాలని మృతుడి కుమారుడు కల్లెపెల్లి శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్ బెల్టు గ్రేడింగ్



కరాటే బెల్టులు సాధించిన విద్యార్థుల

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బుధవారం మార్షల్ ఆర్ట్స్ గ్రేడింగ్ నిర్వహించారు. పలువురు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి చీఫ్ ఎగ్జామినర్ వసంత్‌కుమార్ బెల్టులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ అసిస్టెంట్ కోచ్ రాకేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, పీఈటీలు శ్రీకాంత్, సుప్రజ, అనిల్, రహీం తదితరులు పాల్గొన్నారు.

నత్తకే నవ్వొచ్చేలా !



నత్తనడకన వేములవాడ మూలవాగు ట్యాంక్ బండ్ పనులు



నెమ్మదిగా నడుస్తున్న నందికమాన్ సుందరీకరణ పనులు

- ముందుకుసాగని మినీట్యాంక్‌బండ్ పనులు
- అసంపూర్తిగా కూడళ్ల సుందరీకరణ
- శివరాత్రి ముగిసినా స్పీడందుకోని అభివృద్ధి పనులు
- వేములవాడలో వెక్కిరిస్తున్న సౌకర్యాలు

వేములవాడఅర్బన్: ఆధ్యాత్మిక కేంద్రం వేములవాడలో పలు అభివృద్ధి పనులు నత్తకే నవ్వొచ్చేలా సాగుతున్నాయి. కూడళ్ల సుందరీకరణ అసంపూర్తిగానే ఉండగా, మినీట్యాంక్‌బండ్ పనులు ముందుకుసాగడం లేదు. వేములవాడ మూలవాగు తీరాన ఇరువైపులా ట్యాంక్‌బండ్ పనులు ప్రారంభించారు. ఆ పనులు ప్రారంభించిన మొదట్లో ఊపందుకోగా.. ప్రస్తుతం నత్తనడకన సాగుతున్నాయి. శివరాత్రి మహా జాతర ప్రారంభానికి ముందే కూడళ్ల సుందరీకరణ పూర్తి చేయాలన్నప్పటికీ.. పెండింగ్‌లోనే ఉన్నాయి. శివరాత్రి జాతర ముగియడంతో ఆ పనులపై పర్యవేక్షణ కరువైంది. ఫలితంగా నెమ్మదించాయి.

ముందుకుసాగని ట్యాంక్‌బండ్ పనులు

మూలవాగు తీరాన రూ.64 లక్షలతో చేపట్టిన ట్యాంక్‌బండ్ పనులు పూర్తికావడం లేదు. మూలవాగుకు రెండు వైపులా నాలుగు మీటర్ల వెడల్పుతో 330 మీటర్ల పొడవు చేస్తున్నారు. వాకింగ్ ట్రాక్, పచ్చనిగార్డెన్, చెట్లు, కూర్చునేందుకు సిమెంట్ బెంచీలు, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. కానీ ఈ పనులు ముందుకెళ్లడం లేదు.

నిలిచిన సుందరీకరణ పనులు

వేములవాడ-సిరిసిల్ల-కరీంనగర్ మూడు రహదారుల చౌరస్తా మధ్య గతంలో వేములవాడ రాజన్న ఆలయం వైపు చూస్తున్న నందివిగ్రహం ఏర్పాటు చేశారు. ఆ నంది విగ్రహం చుట్టూ జంక్షన్‌ను రూ.87 లక్షలతో పనులు మొదలుపెట్టారు. అయితే ఈ పనులు మహాశివరాత్రి వరకే పూర్తి చేయాల్సి ఉండగా పెండింగ్‌లో ఉన్నాయి.

ఈనెలాఖరికి పూర్తి చేస్తాం



వేములవాడ మూలవాగు తీరాన రెండు వైపులా ట్యాంక్‌బండ్ పనులు చేపట్టాం. ఈ పనులు మహాశివరాత్రి వరకు పూర్తి చేయాల్సి ఉండేది. కానీ జాప్యం కావడంతో ఈ నెలాఖరి వరకు పూర్తి చేస్తాం. - ప్రశాంత్, వేములవాడ నీటిపారుదలశాఖ డీఈ

'తైవాన్'తో లాభాలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతుపేరు బొంగు మల్లేశం. గంభీరావుపేట మండలం నర్మాల గ్రామం. వానాకాలంలో ప్రభుత్వం వరి వద్దని ప్రత్యామ్నయ పంటలు సాగు చేసుకోవాలని విస్తృత ప్రచారం చేయడంతో ఈయన బొప్పాయి పంట సాగుచేశాడు. భారీవర్షాలు, గాలుల కారణంగా పంట చేతికొచ్చే దశలో మొత్తం దెబ్బతింది. సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి నష్టం జరిగింది. ప్రజాప్రతినిధుల, అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఒక్క పైసా ప్రభుత్వం నుంచి సాయం అందలేదు.

- ఎకరం విస్తీర్ణంలో పెంపకం
- అంతర పంటలుగా వేరుశనగ, కూరగాయల సాగు
- దెబ్బతిన్న బొప్పాయి పంటకు నష్టపరిహారం కరువు
- ఆదర్శంగా నిలుస్తున్న నర్మాల రైతు



వర్షాలకు దెబ్బతిన్న బొప్పాయి తోట (ఫైల్)



తైవాన్ జామ తోట

గంభీరావుపేట (సిరిసిల్ల): మండలంలోని నర్మాల గ్రామానికి చెందిన బొంగు మల్లేశం తన పంటనష్టం వాటిల్లడంతో పాటు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. అయినా పంటమార్పిడి పద్ధతిని అవలంబిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. వృత్తిరీత్యా ప్రైవేటు వైద్యుడు కాగా వ్యవసాయంపై ఆసక్తితో తనకున్న ఎకరం పొలంలో 700 తైవాన్ జామ మొక్కలను పెంచుతున్నాడు. అంతరపంటలుగా వేరుశనగ, టమాట, బీరకాయ, వంకాయ వంటి 20 రకాల కూరగాయలను సాగు చేస్తున్నాడు. సేంద్రియ పద్ధతిలో ఎలాంటి రసాయనిక ఎరువుల వాడకం లేకుండా పంటలు సాగుచేయడం గమనార్హం. తల్లిదండ్రుల సహకారంతో ప్రస్తుతం పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. పెట్టుబడులు తీరే విధంగా ప్రస్తుతం ఆదాయం ఉందని మల్లేశం తెలిపాడు. ప్రభుత్వం సబ్సిడీపై స్ప్రింకర్లు మాత్రమే ఇచ్చింది. డ్రిప్ పరికరాలను సొంతంగా కొనుగోలు చేసి పొలంలో ఏర్పాటు చేసుకున్నాడు కోతులు, పందుల బెడద నివారణకు పొలం చుట్టూ ముళ్లకంచె, వలలు ఏర్పాటు చేశాడు. ప్రభుత్వం సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ ఇస్తే తన పంటలకు రక్షణగా ఉంటుందని కోరుతున్నాడు.

కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మండలకేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ కార్యకర్తలను బెదిరింపులు, భయాందోళనకు గురిచేస్తే ఊరుకునేది లేదన్నారు. గ్రామాల్లో పంచాయతీలకు నిధులు లేక సర్పంచులు లిక్కర్ టెండర్ వేసి వాటి ద్వారా వచ్చిన డబ్బులను గ్రామపంచాయతీ ఖర్చులకు ఉపయోగించే దుస్థితి దాపురించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి, ఆంజనేయులు, సాయిలు, మహేందర్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీపై నిరసన

సిరిసిల్లకల్చరల్: పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం నుంచి పేపర్ లీకేజీ వ్యవహారంపై బీఎస్పీ ఆధ్వర్యంలో సిరిసిల్లలో నిరసన తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను మాట్లాడుతూ బాధ్యత రాహిత్యం, ఉద్యోగుల అవినీతి కారణంగా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో విచారణ చేపట్టాలని కోరారు. మ్యాకల మునీందర్, వర్ధవెల్లి స్వామిగౌడ్, చాకలి రమేశ్, ద్యాగల లక్ష్మి, మ్యాకల దేవేంద్ర, చంద్రునాయక్, యారపు రాజబాబు, లింగంపల్లి మధుకర్, బొడ్డు మహేందర్, చెక్కపల్లి శ్రీనివాస్, సంధ్యానాయక్, తాటిపల్లి అంజయ్య, ఈసంపల్లి కొమురయ్య పాల్గొన్నారు.

విగ్రహాలు ధ్వంసం చేసినవారిని అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండల కేంద్రంలో రెండ్రోజుల క్రితం మహాత్మాగాంధీ, నందీశ్వర విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గాంధీ విగ్రహం చేతిని, నందీశ్వర విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే శిక్షించాలన్నారు. మండలకేంద్రంలో సూపర్ మార్కెట్లు, ఇతరత్రా దుకాణాలుండగా దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే భద్రత ఉంటుందన్నారు. పోలీసులు, పంచాయతీ పాలకవర్గం చొరవ తీసుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి లింగం గౌడ్, మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి దేవయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు నాయక్, నాయకులు గంట బుచ్చగౌడ్, పందిర్ల శ్రీనివాస్, చెన్నిబాబు, రమేశ్ , రాజేందర్, నాగరాజు, ప్రశాంత్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

నకిలీ పట్టాతో కబ్జాకు పాల్పడుతున్నాడు

- రామచంద్రాపూర్ సర్పంచ్ భర్త గడ్డం భాస్కర్‌రెడ్డి



దాసరి లచ్చవ్వ పేరిట ఉన్న నకిలీ పట్టా

తంగళ్లపల్లి(సిరిసిల్ల): దొంగతనంగా లావణీ పట్టాలు సృష్టించి తన పట్టా భూమిని కబ్జా చేసేందుకు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు యత్నిస్తున్నాడని రామచంద్రాపూర్ సర్పంచ్ భర్త గడ్డం భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. తంగళ్లపల్లిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సర్వే నంబర్ 164లోని తన పట్టా భూమిని అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ దాసరి ఆనందం కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని పేర్కొన్నారు. దాసరి ఆనందం తన వదిన వదిన దాసరి లచ్చవ్వ పేరుతో తహసీల్దార్ కార్యాలయం ఫైల్ నంబర్ 670/2018 పేరుతో నకిలీ పట్టా సృష్టించాడని తెలిపారు. ఆ నకిలీ పట్టా చూపుతూ తన పట్టా భూమి కబ్జాకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ప్రభుత్వ సర్వేయర్లు కొలతలు వేయగా భూమి తనదేనని చెప్పినా ఆనందం వినడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారహక్కు చట్టం ద్వారా తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోగా.. ఫైల్ నంబర్ 670/2018 కొట్టెపల్లి అంజయ్య పేరున పట్టా ఉందని, దాసరి లచ్చవ్వ పేరున ఉన్న పట్టా నకిలీదని తేల్చినట్లు పేర్కొన్నాడు. నకిలీ పట్టాతో తన భూమిని కబ్జా చేసిన దాసరి ఆనందం అతనికి సహకరించిన వ్యక్తులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం





ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో నూతనంగా నిర్మించిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం నుంచి ఈనెల 17 వరకు కొనసాగనున్నాయి. బుదవారం అంకురార్పణ, దేవతాహ్వానం, నవగ్రహ పూజలు చేశారు. ఈనెల 17న మాధవానంద సరస్వతీ చేతుల మీదుగా యంత్రప్రతిష్ఠ, విగ్రహాప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ వేడుకలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సందర్శించి, మొక్కులు చెల్లించుకున్నారు. పండితులు రాచర్ల రఘురామశర్మ, రాచర్ల హన్మండ్లుశర్మ ఆధ్వర్యంలో పూజలు కొనసాగుతున్నాయి. ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కంటివెలుగుతో అంధత్వ నివారణ



మానాలలో రెండో విడత కంటివెలుగు వైద్య శిబిరం ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మీనయ్య

రుద్రంగి(వేములవాడ): కంటివెలుగు వైద్య శిబిరాలతో అంధత్వ నివారణ సాధ్యమని రుద్రంగి జెడ్పీటీసి గట్ల మీనయ్య పేర్కొన్నారు. రుద్రంగి మండలంలోని మానాల గ్రామంలో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని వైస్ఎంపీపీ పీసరి చిన్నభూమయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దెగావత్ తిరుపతితో కలిసి ప్రారంభించారు. ఎంపీడీవో మాలోతు శంకర్, పీఏసీఎస్ చైర్మన్ ఏలేటి చిన్నారెడ్డి, ఆర్ఐ నవీన్, నాయకులు బాదనవేని రాజారాం పాల్గొన్నారు.

దీనకు వీల్‌చైర్ల పంపిణీ



వీల్‌చైర్‌ను అందిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలోని రాచర్ల గొల్లపల్లికి చెందిన పూసవేర్ల సత్తవ్వ-నర్సయ్య దంపతుల కుతూరు దీన పుట్టుకతోనే పోలియోతో బాధపడుతూ కదలలేని స్థితిలో ఉంది. పాప దీన గాథ గురించి బుధవారం సాక్షి దినపత్రికలో వచ్చిన 'బిడ్డలను సాదుడు కష్టమైతంది' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, దాతలు స్పందించారు. అధికారులు ఒక వీల్‌చైర్‌ను, గొల్లపల్లికి చెందిన మద్దివేణి శ్రీధర్ మరో వీల్‌చైర్‌ను అందించారు. దాతలు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాలేజీ భవనం మంజూరుపై హర్షం

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు భవనం మంజూరు కావడంపై అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. నూతన భవనంతోపాటు ఇదే కాలేజీకి పరీక్ష కేంద్రం సైతం మంజూరైంది. మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే రమేశ్ బాబుకు ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య హర్షం వ్యక్తం చేశారు.

కన్నకూతురిని వదిలిపెట్టిన తల్లిదండ్రులు

- శారీకర వైకల్యంతో బాధపడుతున్న బాలిక
- ఏరియా ఆస్పత్రిలో ఆశ్రయం



ఆస్పత్రిలో ఆశ్రయం పొందిన బాలిక

వేములవాడఅర్బన్: మానసిక పరిస్థితి బాగాలేక, శారీరక వైకల్యంతో బాధపడుతున్న కూతురిని తల్లిదండ్రులు వదులుకున్న సంఘటన వేములవాడలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. రాజన్న ఆలయ పరిసరాల్లో దాదాపు పదిహేనేళ్ల బాలికను వదిలిపెట్టి వెళ్లారని స్థానికులు 1098కు మంగళవారం రాత్రి సమాచారం అందించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి స్వర్ణలత ఆలయ పరిసరాలకు చేరుకొని.. మానసిక పరిస్థితి బాగా లేక, శారీరక వైకల్యంతో బాధపడుతున్న బాలికను వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం అందించి కేసు నమోదు చేయించారు. బాలికకు సంబంధించిన బంధువుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ సమాచారం దొరకడం లేదని స్వర్ణలత తెలిపారు. వేములవాడ ఏరియా ఆస్పత్రిలో ఉన్న బాలిక పరిస్థితిని బుధవారం జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ అంజయ్య, సభ్యులు పున్నం చందర్, సహాయ అధికారి సునీత పరిశీలించారు.

సమస్యలపై సంఘటితంగా పోరాడాలి

- పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్ల టౌన్ : వస్త్ర పరిశ్రమలోని అన్నిరంగాల నేత కార్మికులు సంఘటితంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి పోరాడాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ పిలుపునిచ్చారు. బుధవారం సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బతుకమ్మ చీరలు, ఇతర ఉత్పత్తులు నేసే కార్మికుల సమస్యలు ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల నేత కార్మికుల సంక్షేమానికి యూనియన్ నిరంతర పోరాటం చేస్తుందన్నారు. అన్నిరంగాల కార్మికులు గురువారం నుంచి యూనియన్ సభ్యత్వాలు తీసుకోవాలని కోరారు. జిల్లా నాయకులు నక్క దేవదాసు, శ్రీపతి మని, కంది మల్లేశం, గడ్డం రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

12 తులాల బంగారు ఆభరణాలు చోరీ



తెరిచి ఉన్న బీరువా

బోయినపల్లి (చొప్పదండి) : మండలంలోని అనంతపల్లి గ్రామానికి చెందిన అనుపట్ల మల్లారెడ్డి ఇంట్లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై పుల్లా అభిలాష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..మల్లారెడ్డికి ఇద్దరు కుమారులుండగా వేర్వేరు ఇళ్లు ఉన్నాయి. ఓ ఇంట్లో ఏడాదిగా మల్లారెడ్డి వియ్యంకుడు లచ్చిరెడ్డి ఉంటున్నాడు. మరో ఇంట్లో మల్లారెడ్డి కుమారుడు కరుణాకర్ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. బుధవారం ఉదయం కరుణాకర్ గేదెలకు మేత వేసేందుకు వెళ్లగా వచ్చేసరికి బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో 12 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లుగా గుర్తించారు. మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్సై అభిలాష్ చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేపట్టారు.

వివాహ వేడుకల్లో ఘర్షణ

- ఊపిరి ఆడక మహిళ మృతి

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం బండపల్లిలో బుధవారం జరిగిన వివాహ వేడుకల్లో అపశృతి నెలకొంది. చిన్నపాటి వాగ్వాదం పెరిగి పెద్దదై వివాదానికి దారితీసింది. ఇరు వర్గాల ఘర్షణలో ఓ మహిళ ఊపిరాడక ప్రాణాలొదిలింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. మండలంలోని బండపల్లికి చెందిన గోగుల లస్మయ్య-ప్రేమలత కూతురు తేజశ్విని(శిరీష) వివాహం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం విఠలాపురం గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌తో బుధవారం జరిగింది. కట్నకానుకల విషయంలో ఏర్పడిన చిన్నపాటి వివాదం ముదిరి ఘర్షణకు దారితీసింది. గొడవకు దిగిన యువకుడు భయాందోళనతో డీసీఎం వ్యాన్‌లో ఎక్కి తలదాచుకోగా.. తమపైనే చేయిచేసుకుంటావా.. అంటూ కొందరు యువకులు వ్యాన్‌లోకి వెళ్లి దాడి చేశారు. ఈ దాడిలో అక్కడే ఉన్న మహిళ ఊపిరి ఆడక స్పృహ కోల్పోయింది. చికిత్స అందించేందుకు వేములవాడకు తరలిస్తుండగా ప్రాణాలు వదిలింది. పోలీసులు ముందుస్తు చర్యల్లో భాగంగా మృతదేహాన్ని వేములవాడ ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీగదిలో ఉంచి, గదికి తాళం వేసినట్లు తెలిసింది. బండపల్లిలో రాత్రి పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు సమాచారం.

'గురుకుల' ప్రవేశ దరఖాస్తులకు నేడే చివరి తేదీ

తంగళ్లపల్లి (సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో ఐదో తరగతి ప్రవేశాల దరఖాస్తుకు గురువారం చివరి తేదీ అని ప్రిన్సిపాల్ ఎస్.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని బాలికలు నేడు ఆన్‌లైన్ ద్వారా రూ.100 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బద్దెనపల్లి గురుకులంలో 80 సీట్లు ఉన్నాయని నాలుగో తరగతి చదువుతున్న బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు హెల్ప్‌లైన్ నెంబర్ 18004254 5678 ను సంప్రదించాలన్నారు.